## క్లుప్తంగా

### హిందీ పరీక్షలు ప్రారంభం



**తిరువూరు:** దక్షిణభారత హిందీ ప్రచార సభ నిర్వహించే వార్షిక పరీక్షలు తిరువూరు సర్వోదయ స్కూల్ సెంటర్లో శనివారం ప్రారంభమయ్యాయి. తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు మండలాల నుంచి ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారని పరీక్షా కేంద్ర ముఖ్య పర్యవేక్షకులు రమణమూర్తి తెలిపారు. ప్రచార సభ ప్రచారక్ రఘునందన్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. ఆదివారం కూడా పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

### సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

**చాట్రాయి:** మండలంలోని చిన్నంపేట బీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు శనివారం ప్రారంభించారు. ఇటీవల గ్రామంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, గ్రామ సర్పంచ్ పరసా ధనలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ పరసా చెన్నారావులు బీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. దీంతో రూ.20 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ మొత్తంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు, రూ.5 లక్షలతో డ్రెయినేజీ పనులను పనులు ప్రాంభించారు.

### పేద ఆర్యవైశ్యులకు ఆర్థికసాయం



**తిరువూరు:** వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీవేంకటాచలస్వామి దేవస్థానంలో పేద ఆర్యవైశ్యులకు ఆర్థికసాయం అందజేశారు. జోనల్ చైర్మన్ నాళ్లా రామారావు ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్యులకు ప్రతి నెలా పెన్షన్ మంజూరు చేపట్టారు. అమ్మ ప్రేమాశ్రమంలో వృద్ధులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. తిరువూరు వాసవీ క్లబ్ చైర్మన్ దోసపాటి రవికుమార్, వనిత క్లబ్ చైర్మన్ చిత్తలూరి అనురాధ, యువసేన క్లబ్ అధ్యక్షుడు సుధాకర్, సీనియర్ సిటిజన్స్, కపుల్స్ క్లబ్బుల చైర్మన్లు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**పెనుగొలను(గంపలగూడెం):** పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గంపలగూడెం మండలం పెనుగొలనులో శనివారం చోటు చేసుకుంది. ఎస్.ఐ వి.సతీష్ తెలిపిన సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన తోట జగన్నాథం (88) గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంటి వద్ద ఉన్న పురుగు మందు తాగాడు. వెంటనే కుటుంబీకులు అతనిని చికిత్స కోసం తెలంగాణ రాష్ట్రం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుని కుమారుడు సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.





# వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివకిరణ్



మైలవరం కోర్టులో లోక్ అదాలత్‌లో జడ్జి షేక్ షిరీన్, న్యాయవాదులు

**తిరువూరు:** చిన్నపాటి తగాదాలు, స్వల్ప వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.శివకిరణ్ సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా స్థానిక కోర్టు ఆవరణలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. పోలీసు కేసులు, కోర్టు వివాదాల కారణంగా డబ్బు, విలువైన సమయం వృథా చేసుకోకుండా ప్రతి ఒక్కరూ సానుకూల ధోరణితో వ్యవహరించాలని జడ్జి తెలిపారు. రాజీ చేసుకోదగిన వివాదాలను లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ చట్టాల గురించి న్యాయవాదులు రేగళ్ళ మోహనరెడ్డి, సంకురాత్రి జనార్ధనరావు, రాజవరపు శ్రీనివాసరావు, మోదుగుమూడి శ్రీనివాసరావు, ఎం.నాగేంద్రప్రసాద్, ఆనందస్వరూప్ వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కుమార్, కక్షిదారులు పాల్గొన్నారు.

**లోక్ అదాలత్‌లో 620 కేసుల పరిష్కారం**

**తిరువూరు:** స్థానిక కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 620 కేసులు పరిష్కరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్ ఆధ్వర్యంలో జరిగిన అదాలత్‌లో రాజీ చేసుకోదగిన 17 సివిల్ కేసులు, 585 క్రిమినల్ కేసులు, 18 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించారు. అదాలత్‌లో న్యాయవాదులు పాల్గొన్నారు.

### లోక్ అదాలత్ కార్యక్రమాల్లో న్యాయమూర్తులు

**లోక్ అదాలత్‌లో 740 కేసులు పరిష్కారం**

**మైలవరం:** రాజీ పడటానికి అవకాశం ఉన్న కేసులు కక్షిదారులు రాజీ చేసుకోవాలని జడ్జి షేక్ షిరీన్ తెలిపారు. మైలవరం కోర్టులో సుప్రీమ్ కోర్టు ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ పిలుపుతో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. లోక్ అదాలత్‌లో 740 కేసులు పరిష్కారం అయినట్లు మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జడ్జి షేక్ షిరీన్ తెలిపారు. రాజీ చేసుకోవడం వలన సమయం, డబ్బు వృథా కాదన్నారు. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతోనే కేసులు పరిష్కారమయ్యాయన్నారు. సమావేశంలో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముల్లంగి రవికుమార్, సీనియర్ న్యాయవాదులు పీ.వీ. శేషగిరిరావు, బుద్దవరపు వెంకట్రావు, వీ.టీ కిశోర్, ఏడీ ప్రసాద్, ఎమ్ శరత్‌బాబు, కక్షిదారులు పాల్గొన్నారు.

**నూజివీడు:** లోక్‌అదాలత్‌లో ఇచ్చిన తీర్పునకు అప్పీలు లేదని, కేసులు సత్వరమే పరిష్కారమవుతాయని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ పేర్కొన్నారు. స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అదాలత్‌కు ఆమె హాజరై కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడారు. రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడం కక్షిదారులకు మేలన్నారు. ప్రతి ఒక్కరూ లోక్‌అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. జడ్జిలు షేక్ పెదఖాసిం, డి.దుర్గా కల్యాణి, వి.వెంకటేశ్వరరావు, పి.సాయిరామ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే విక్రమ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు కేజే డిక్సన్, గాంధీ, మడుపల్లి బసవారావు తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి నాగశైలజ

847 కేసుల పరిష్కారం..

జాతీయ లోక్‌అదాలత్‌లో 847 కేసులను పరిష్కరించారు. వీటిలో సమరీ ట్రైల్ కేసులు 643, క్రిమినల్ కేసులు 107, సివిల్ కేసులు 28, ప్రీలిటిగేషన్ కేసులు 54, చెక్కు బౌన్స్ కేసులు 7, వివాహ సంబంధ కేసులు 4, ఎంవీఓపీ కేసులు 4 పరిష్కరించారు. ఎంవీఓపీ కేసులకు సంబంధించి రూ.81.70 లక్షల నష్టపరిహారం చెల్లించారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రక్షణనిధి
- తిరువూరులో గడప గడపకు మన ప్రభుత్వం



తిరువూరులో అంగన్‌వాడీ కేంద్రం పిల్లలతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

**తిరువూరు:** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకూ అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. శనివారం తిరువూరు 10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించినపుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి గుర్తించిన పేదల సమస్యలను అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా పరిష్కరిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, గతంలో ఏ ప్రభుత్వమూ ఇంత పెద్ద ఎత్తున పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాలన గ్రామస్థాయిలో సజావుగా జరిగేందుకే సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని, వలంటీర్ల ద్వారా సత్వరం సేవలందుతున్నాయన్నారు. విద్యార్థులు, రైతులు, డ్వాక్రా మహిళలు, చేతివృత్తుల వారికి అందుతున్న పథకాలలో మరింత ప్రయోజనం కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కమిషనర్ బాలకృష్ణ, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డి, వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, మోదుగు ప్రసాద్, కాకర్లమూడి సుందరకుమార్, నడింతిరువూరు పీఏసీఎస్ చైర్మన్ గజ్జల సీతారామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెలుగోటి ఆదినారాయణ, రఫీ, చలమాల సత్యనారాయణ, అజీజ్ పాల్గొన్నారు.

# దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం

**విస్సన్నపేట:** స్థానిక గంగా పార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించారు. నూతన పాలకవర్గంతో ఆలయ ఈఓ వై సీతారామయ్య సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. పాలక వర్గ సభ్యులు రామవరపు దుర్గాప్రసాద్, కోటా పద్మావతి, మనుసు ప్రసాద్, మేకల నాగరాజులు కలసి కుక్కడపు హనుమాన్ వెంకటరత్నంను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, మాజీ వైస్‌ఎంపీపీ ఓలేటి దుర్గారావు,వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఎంపీటీసీ జి మల్లయ్య,వార్డు సభ్యుడు పిల్లి రాజేష్,పార్టీ నాయకులు కోట కిట్టు, మాధవరెడ్డి, అబ్బినేని హరి,పెండెం సత్యనారాయణ,బోనం మహేశ్వరరావు పాల్గొన్నారు.



సభ్యులతో ఆలయ ఈఓ సీతారామయ్య, ఎంపీపీ మెర్సీవనజాక్షి

# దీన్ దయాళ్‌కు బీజేపీ నేతల నివాళి

**గంపలగూడెం:** బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో జన సంఘ్ పార్టీ అధ్యక్షుడు, ఏకాత్మతా మానవతా వాదాన్ని బీజేపీకి అందించిన సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. గాంధీ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. పార్టీ జిల్లా మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలు వనమా సుజాత, బీసీ మోర్చ కార్యదర్శి కే నాగగోపాలకృష్ణ, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు అన్నవరపు క్రాంతి కుమార్, ఉపాధ్యక్షుడు నేరళ్ళ యుగంధర్, ప్రధాన కార్యదర్శి అంకుశం సూర్య ప్రకాష్, డీవీ రామారావు, పాపోలు నరసింహారావు, వాసా జగన్ పాల్గొన్నారు.

**నూజివీడు:** బీజేపీ సిద్ధాంత కర్త, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జాతీయ మాజీ అధ్యక్షుడు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతిని నూజివీడులో శనివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీన్‌దయాల్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏకాత్మ మానవతా వాద సిద్ధాంతంతో, అంత్యోదయ స్ఫూర్తి నిచ్చిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్తమాన తరానికి ఆదర్శనీయుడని రాజశేఖర్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వైఎస్ దొరై, జిల్లా కార్యదర్శి శివరాజు వసుంధరదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు భావరాజు పుల్లారావు, అనమాల నాగేశ్వరరావు, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ అలీషా, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబటి మల్లేశ్వరరావు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి రెడ్డి మురళీ మోహనరావు, కార్యదర్శి వరాటి బాలు, గుత్తి రాము తదితరులు పాల్గొన్నారు.



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

**ఇబ్రహీంపట్నం:** బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి బీజేపీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎన్టీఆర్ జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి నివాళులర్పించారు. ఆయన ప్రవచించిన అంత్యోదయ సిద్ధాంతాన్ని గతంలో మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పాయ్ అమలు చేయగా ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ ముందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కూనల యుగంధర్, నాయకులు పాల్గొన్నారు.

### మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



**ఇబ్రహీంపట్నం:** ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా పవిత్ర సంగమం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవసరమైన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. స్నానఘాట్లలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు, పిండ ప్రధానం చేసేందుకు ప్రత్యేక టెంట్లు, భక్తులకు తాగునీరు, వైద్యశిబిరం, రవాణా, వాహనాల పార్కింగ్, పారిశుద్ధ్యం చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. చురుకుగా పనులు చేపట్టాలన్నారు.

### ఏటీఎం కేంద్రం మార్పు

**మైలవరం:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ విజయవాడ ఏఓ కే రంగరాజన్ శనివారం తెలిపారు. మైలవరంలోని నారాయణ థియేటర్ కాంప్లెక్స్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంను పక్కనే ఉన్న ఎస్‌వీఎస్ ఏజెన్సీస్ పెట్రోల్ బంక్ ప్రాంగణంలోనికి మార్చారు. వినియోగదారులు లావాదేవీలను యథావిధిగా కొనసాగించుకోవాల్సిందిగా కోరారు. విజయవాడ నార్త్ రీజనల్ మేనేజర్ పీ రాధిక, మైలవరం బ్రాంచ్ మేనేజర్ కే శ్రీరామచంద్రమూర్తి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

### బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

**ఇబ్రహీంపట్నం:** బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పసాని రామకృష్ణ అన్నారు. ఎన్టీటీపీఎస్ సంఘం కార్యాలయంలో ఉద్యోగుల సమావేశం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ బీసీల ఆరాధ్యదైవం బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణ ఈనెల 12న గుంటూరులో జరుగుతుందన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉద్యోగులు విజయవంతం చేయాలన్నారు. ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, పుల్లారావు, శ్రీహరి, మాదవరావు, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా ఆలయ వార్షికోత్సవం

**ఆగిరిపల్లి:** మండలంలోని సింహాద్రి అప్పారావుపేట కోదండ రామాలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారామ లక్ష్మణులను దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# వేధింపులపై మహిళ ఫిర్యాదు

**నూజివీడు:** తన కోరిక తీర్చమని నిత్యం వేధిస్తున్నాడని, ఇంటిపైన రాళ్లు వేస్తూ హతమార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడంటూ ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముసునూరు మండలం సింహాద్రిపురం శివారు సింహాద్రి అప్పారావుపేటకు చెందిన యువతి (27) అదే గ్రామానికి చెందిన అశోక్ (50) అనే వ్యక్తి తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని పేర్కొంది. మూడు నెలలుగా తన కోరిక తీర్చమని వేధించడమే కాకుండా ఇంటిపైకి రాళ్లు విసురుతున్నాడని, దీనిపై గత ఏడాది నవంబరు నుంచి ఇప్పటికి రెండుసార్లు ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా తనకు సరైన న్యాయం చేయడం లేదని వాపోయింది. ఈనెల 10న రాత్రి 9.30గంటల సమయంలో ఇంటి బయట ఉన్న తనను చేయి పట్టుకొని లాగగా పెనుగులాటలో కిందపడటంతో నడుముకు గాయమైందని, తాను పెట్టిన కేకలకు తన కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు రావడంతో అతను పరారయ్యాడని పేర్కొంది. నడుం వద్ద దెబ్బతగలడంతో శనివారం నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని, పోలీసులు ఆసుపత్రికి రాగా ఫిర్యాదు చేశానని తెలిపింది. ఈ విషయమై నూజివీడు రూరల్ సీఐ అంకబాబు మాట్లాడుతూ తమకు ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# మోడల్ పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ

**రెడ్డిగూడెం:** మండలంలోని మద్దులపర్వ ఆదర్శ పాఠశాల నందు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు 10వ తరగతి మోడల్ పరీక్ష పోస్టర్‌ను శనివారం ఆవిష్కంచారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వీర్రాజు చేతుల మీదుగా గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రెడ్డిగూడెం మండల నాయకులు కే బాలు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రజ్ఞా వికాసం పేరుతో 10వ తరగతి మోడల్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 20వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనాలని సూచించారు.



ప్రజ్ఞ వికాసం గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు

# పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

**విస్సన్నపేట:** ఇటీవల మృతి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు రెడ్డి వెంకట సూర్యనారాయణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి శనివారం పరామర్శించారు. వైస్ ఎంపీపీ రెడ్డి వెంకట శ్రీనివాసరావు కాలికి ఇటీవల గాయం కావటంతో ఆయన్ను, ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న విశ్రాంత తెలుగు లెక్చరర్ ముంగా జయరాజ్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు వెంకట కుటుంబరావు పాల్గొన్నారు.



వైస్‌ఎంపీపీని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

### 13న హైవే దిగ్బంధం



**ముసునూరు:** ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ తదితర ఉద్యమ సంఘాల ఆధ్వర్యంలో 13వ తేదీన నిర్వహించే జాతీయ రహదారి దిగ్బంధానికి వేలాదిగా తరలి రావాలని ఆ సంఘ జిల్లా కో కన్వీనర్ తొమ్మండ్రు రుద్రయ్య, నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ కంకట వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను శనివారం సాయంత్రం ముసునూరులోని బాబూ జగ్జీవన్‌రామ్ సెంటర్‌లో విడుదల చేశారు. నాయకులు చీలి అర్లప్ప, కేవీఎస్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

### బలివే ఉత్సవాలకు పందిరి రాట



**ముసునూరు:** బలివే ఉత్సవాలకుతమ్మిలేరు రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయగా శనివారానికి వలసపల్లి చేరుకున్నాయి.శుభ ఘడియల్లో అర్చకులు తోలేటి అరుణభాస్కర్, చావలి అమర్‌బాబు మంత్రోచ్ఛారణలమధ్య భక్తిశ్రద్ధలతో పందిరి రాట (గుంజ)ను ఆరంభించారు. సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఈఓ విశ్వేశ్వరరావు, పెద్దలు నాగుల నాగేశ్వర రావు, పిల్లి రెడ్డియ్య పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సుకు టెక్నాలజీ దోహదం

**కేంద్ర రక్షణ శాఖ మంత్రి సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి**

**మైలవరం:** టెక్నాలజీని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలని, తద్వారా లబ్ధి పొందాలని కేంద్ర రక్షణ శాఖా మంత్రికి పరిశోధనా సలహాదారు డాక్టర్ జీ. సతీష్‌రెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సతీష్‌రెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీలో వచ్చే మార్పులకు అనుగుణంగా తమ భవిష్యత్తుకు రూపుదిద్దుకోవాలన్నారు. విద్యార్థులు పరిశోధనా, ఇన్నోవేషన్లలో దృష్టి సారిస్తే ఆయా రంగాలలో వారు అనుకున్నది సాధిస్తారని తెలిపారు. ఈ కళాశాల జిల్లా స్థాయిలో విద్యార్థులకు కావలసిన సకల సదుపాయాలు ఉన్న ఏకైక కళాశాల అని అన్నారు. ఏపీఎస్‌సీహెచ్ఈ చైర్మన్ కే.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ కమ్యూనికేషన్స్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్‌లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలన్నారు. లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ చైర్మన్ దివంగత లకిరెడ్డి బాలిరెడ్డి దార్శనికతతో మెట్ట ప్రాంతమైన మైలవరంలో విద్యా దానం గురించి వివరించారు. బాలిరెడ్డి స్వగ్రామం వెల్వడం గ్రామాభివృద్ధికి, మైలవరానికి వారు చేస్తున్న కృషిని వివరించారు. జేఎన్‌టీయూకే వైస్ ఛాన్సలర్ డాక్టర్ జీ.వీ.ఆర్. రాజు, ప్రవాసాంధ్రులు కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి, లకిరెడ్డి సోదరులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కళాశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ కుదుముల తిమ్మారెడ్డి, గోగులమూడి సత్యనారాయణరెడ్డి ప్రసంగించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, అవార్డులు, వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే.అప్పారావు, కళాశాల ప్రసిడెంట్ జీ.శ్రీనివాసరెడ్డి, జీ.సాంబశివారెడ్డి, గ్రామ ప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో వేదికపై ప్రముఖులు

# 'మనుస్మృతి' ఆవిష్కరణకు నిరసన

**నూజివీడు:** భారతీయ సామాజిక అసమానతలకు కారణమైన మనుస్మృతి గ్రంథాన్ని ఆవిష్కరించేందుకు ప్రయత్నించడం రాజ్యాంగ వ్యతిరేకమని దళిత జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నత్తా నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో ఫిబ్రవరి 15న మనుస్మృతి ప్రాచీన రాజ్యాంగం శిక్షాస్మృతి పేరుతో గ్రంథాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాటు చేయడాన్ని నిరశిస్తూ దళిత సంఘాలు శనివారం నూజివీడు చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ దళితుల, వెనుకబడిన కులాల మహిళల మాన ప్రాణాలకు కళంకం ఈ మనుస్మృతి అని, మనుస్మృతిని ప్రాచీన భారత రాజ్యాంగం పేరుతో ఆవిష్కరించే ప్రయత్నాన్ని దేశ ద్రోహ చర్యగా పరిగణించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి కృపారావు, దళిత జేఏసీ నాయకులు రెంటపల్లి అంబేడ్కర్, రామకూరి మరియదాసు, మొగదాటి జోజిబాబు, తులిమెల్లి కిషోర్, అయ్యంకి సురేష్ పాల్గొన్నారు.




నిరసన ప్రదర్శన చేస్తున్ననాయకులు

### జెడ్పీ ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా చాట్ల



**మైలవరం:** పంచాయతీ రాజ్ జిల్లా పరిషత్ ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి కృష్ణా జిల్లా నూతన అధ్యక్షుడిగా చాట్ల సువర్ణరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కార్యదర్శిగా పీ రవికిరణ్, గౌరవ అధ్యక్షుడుగా ఆర్.ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు చాట్ల సువర్ణరాజు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి, సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు కే గోవిందరాజు, రాష్ట్ర కార్యదర్శి వీ.లక్ష్మయ్య, ఉద్యోగులందరికి ధన్యవాదాలు తెలిపారు.